# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 5 మార్చి 2026 | ■ 12 పేజీలు




## మొదటికొచ్చిన పునరావాస భూముల లొల్లి

■ పాత ఊళ్లకు తరలివస్తున్న రాంపూర్, మైసంపూట్ గిరిజనులు ■ వంటావార్పు చేపట్టి నిరసన



■ పల్లె ముంగిటకే 'ప్రజా పాలన' ■ ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్త గ్రామ సభలు

■ రేపటి నుంచి సన్నాహాలు ■ ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలుకు సిద్ధం

■ పారిశుద్ధ్యం, ఫైళ్ల క్లియరెన్స్‌తో శ్రీకారం ■ సీఎం సందేశంతో ప్రారంభం..

■ 99 రోజుల పాటు 'ప్రగతి ప్రణాళిక' ■ నోడల్ అధికారుల నియామకం పూర్తి

■ ఆరోగ్యం నుంచి అమలవుతున్న పథకాల వరకు గ్రామ సభల్లో సమగ్ర నివేదన

■ అమ్మ ఆదర్శ పాఠశాలలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల చెంతకే నివేదికలు

■ కొత్త ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న ప్రత్యేక శిక్షణా తరగతులు..

■ జూన్ 12 వరకు కొనసాగనున్న కార్యాచరణ

■ 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' మార్గదర్శకాలు జారీ

■ నిన్న దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

■ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక యాప్..



# పల్లె ప్రగతికి సరికొత్త బాట

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహించాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. ఈ సభల నిర్వహణ విధానాన్ని, ప్రజలకు వివరించాల్సిన అంశాలపై వివరాలు వెల్లడించింది. 99 రోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రభావవంతంగా నిర్వహించాలని అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 అంశాల(థీమ్)కు నోడల్ శాఖలను ప్రకటించి, నోడల్ అధికారులను నియమించింది. ఈ కార్యక్రమ మార్గదర్శకాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం జారీ చేశారు. జిల్లా కలెక్టర్లతో సీఎస్ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

### రేటి నుంచే ప్రగతి ప్రణాళిక

■ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్

రాజర్షిషా సమీక్షా సమావేశం

■ అధికారులకు దిశా నిర్దేశం



## అక్రమ కేసులకు భయపడను

■ చెన్నూరులో ప్రజాతీర్పును గౌరవించాం ■ పదేళ్లలో ఎవరిపై కేసులు పెట్టలేదు

■ మాజీ ఎమ్మెల్యే సుమన్ ■ ఆదిలాబాద్ జైలు నుంచి సుమన్, నాయకులు విడుదల

■ భారీగా తరలివచ్చి స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు ■ ర్యాలీగా క్యాతన్‌పల్లికి..

రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడే ప్రసక్తే లేదని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టం చేశారు. మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి ఘటనలో అరెస్టయిన ఆయన, 16 రోజుల శిక్ష అనంతరం బుధవారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా క్యాతన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుమన్ మాట్లాడారు.

### మూడు నెలల కోటా
## బియ్యం ఒకేసారి
### కేంద్ర ప్రభుత్వం ఆదేశం

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే బియ్యం మూడు నెలల కోటా ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎండల తీవ్రత నేపథ్యంలో కార్డు దారులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన కోటాను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.





## సింగరేణి గనుల్లో 'ఊపిరి' ఆడని వైనం

■ గాలి అందక స్పృహతప్పిన కార్మికుడు

■ శాంతిఖనిలో రక్షణ గాలి కరువు..

■ మృత్యుకుహరంలో బొగ్గు కార్మికులు!

■ గనిలో అన్వేష్‌కు తప్పిన ప్రమాదం

■ వెంటిలేషన్ అధికారి నిర్లక్ష్యమే కారణమా?

■ ఆసుపత్రి పాలైన కార్మికుడు!

సింగరేణి బొగ్గు బావుల్లో ఊపిరాడని పరిస్థితి కార్మికుల ప్రాణాలకు పెనుముప్పుగా మారింది. భూగర్భగనిలో కనీస గాలి సరఫరా చర్యలపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందుకు నిదర్శనంగా శాంతిఖనిలో మొదటి షిఫ్టులో పని చేస్తున్న ఓ కార్మికుడు ఊపిరాడక కింద పడిపోయిన సంఘటన ఉదాహరణగా పేర్కొనవచ్చు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ భూగర్భగనుల్లో కనీస సదుపాయాలు లేక కార్మికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. శాంతిఖని గనిలో 47-లెవెల్‌లో బుధవారం సపోర్ట్ పనులు చేస్తున్న అన్వేష్ అనే బదిలీ కార్మికుడు ఊపిరి అడక ఆస్పత్రి పాలయ్యాడు.



## పెళ్లికి రండి

■ కుమారుడి పెళ్లికి ఆదివాసీ మహిళలను ఆహ్వానించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

■ వాట్సాప్ ద్వారా ఆహ్వాన పత్రికను పంపిన భట్టి

## ఎందుకు యూరియా సెంటర్?

■ సోమన్‌పల్లి డీసీఎంఎస్ నిర్వాహకులపై డీఏవో ఆగ్రహం..



# నా కొడుకు బర్త్ డే నాడు
# నన్ను ఇంట్లో లేకుండా చేశారు

## జైలు నుంచి బయటకొచ్చాక సుమన్ ఆవేదన

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికైనా సవ్యంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**జైలు నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే విడుదల..**
మంత్రి వివేక్ కాన్వాయ్ పై దాడి కేసులో అరెస్టయిన బాల్క సుమన్ ఇవాళ ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నికల సమయంలో జరిగిన గొడవకు సంబంధించి ఆయన 14 రోజుల పాటు ఆదిలాబాద్



జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బాల్క సుమన్‌తో పాటు మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ముల రాజారెడ్డి, మాజీ కౌన్సిలర్ అనిల్ కుమార్, నాయకుడు లక్ష్మీకాంత్ బయటకు వచ్చారు. కాగా ఆయనకు మాజీ మంత్రి జోగు రామన్న, చెన్నూర్ నియోజకవర్గం నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికాయి. అనంతరం భారీ వాహన శ్రేణితో నాయకులందరూ క్యాతన్‌పల్లికి బయలుదేరారు. బీఆర్ఎస్ కార్యకర్తల నినాదాలతో జైలు పరిసర ప్రాంతాలు మారుమోగాయి.



## చిన్నారులను అంగన్వాడీ
# కేంద్రాలకు పంపాలి

**జన్నారం, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
3-5 ఏళ్ల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీలకు పంపాలని తిమ్మాపూర్ సర్పంచి గుడ్లావత్ సంగీత, అంగన్వాడి టీచర్ సంజీవరాణి సూచించారు. బుధవారం తిమ్మాపూర్ అంగన్వాడీ కేంద్రం-1లో గర్భిణీలు, బాలింతలకు బాలామృతం, గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే ఈ ఆహారం ఎంతో బలవర్ధకమైనదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజు, ఆశా కార్యకర్త రజిత ఆయా మమత, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల్లో
# 376 మంది గైర్హాజరు

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 8,529 మంది విద్యార్థులకు గాను 8,153 మంది హాజరయ్యారని డీఐఈఓ జాదవ్ గణేశ్ కుమార్ తెలిపారు. జనరల్ విభాగంలో 282 మంది, ఒకేషనల్ విభాగంలో 94 మంది కలిపి మొత్తం 376 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఇంటి వద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాలు

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వెళ్లలేని భక్తుల కోసం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి బుధవారం ఒక ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్స్, దేవాదాయ శాఖ సహకారంతో సీతారాముల కళ్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేరవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని భక్తులు రూ.151 చెల్లించి ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా ఈ సేవలను బుక్ చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.




# సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



**కాగజ్‌నగర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని మార్కెట్ యార్డులోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ రైతులకు సేంద్రియ వ్యవసాయం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసినీ గ్రామాన్ని ఎంపిక చేసి 125 మంది రైతులకు సేంద్రియ ఎరువులు, జీవామృతం, వర్మీ కంపోస్ట్, ఘనజీవామృతం తయారీ విధానంపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా భూమి సారాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. అలాగే నానో ఎరువుల వినియోగం పెంచుకుని, ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్గానిక్ పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నాయని వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. సాగు విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కోసినీ గ్రామంలో ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం చేస్తున్న కొంతమంది రైతుల అనుభవాలను సమావేశంలో పాల్గొన్న రైతులతో పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం చేపట్టినప్పుడే భూమి ఆరోగ్యం కాపాడబడుతూ, పంటల పోషక విలువలు మెరుగుపడతాయని అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, దుర్గాభవాని, సృజన పాల్గొన్నారు.



## దివ్యాంగుల హక్కుల
# పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

### దివ్యాంగుల పట్ల అనుచితంగా ప్రవర్తించేవారి పట్ల సహించేది లేదు
### కుమ్రంభీం జిల్లా అదనపు కలెక్టర్ డెవిడ్

**ఆసిఫాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
దివ్యాంగులకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డెవిడ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. చేయూత పింఛన్ల పంపిణీ కేంద్రాల వద్ద దివ్యాంగులకు త్రాగునీరు, నీడ, ప్రత్యేక మరుగుదొడ్ల వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.సదరం శిబిరాల వద్ద వీల్‌చైర్లు, హెల్పర్లు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం అర్హులైన వారందరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దివ్యాంగుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దివ్యాంగుల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి మండలంలో అధికారులతో సమావేశాలు నిర్వహించి దివ్యాంగుల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి బాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావు, విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులు, దివ్యాంగుల హక్కుల సమితి సభ్యులు ఇస్లాం బిన్ అహ్మద్, వెంకటేశ్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మృత్యు మలుపులు.. అధికారుల ఉదాసీనత

### వాంకిడి-బండ కాసా రహదారిపై నిత్యం ప్రమాదాలు
### కనీస సూచిక బోర్డులు లేక వాహనదారుల అవస్థలు
### పొదలు పెరిగి అంధకారంగా మారిన వంపులు
### పట్టించుకోని అధికార యంత్రాంగం

**వాంకిడి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులకు మూలమల్పులు ప్రమాదకరంగా మారాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల పరిధిలో ఖమాన, దుబ్బగూడా, కనర్గాం, ఇందాని, జైత్పూర్, వెల్గి, చౌపన్ గూడా, పిప్పర్ గొంది, పిచ్చిపల్లి ఆయా గ్రామాలకు వెళ్లే దారుల్లో మలుపులు అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఈ మార్గాల్లో తరచు



ప్రమాదాలు సంభవిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పెరిగిన చెట్ల పొదలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

# పబ్లిక్ పరీక్షలంటే భయం వీడండి..!

**సైకాలోజిస్ట్ బి.రజిత**

**జైపూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు భయం వీడి ఒత్తిడి లేకుండా ప్రశ్నలకు చక్కటి సమాధానాలు రాయాలని సైకాలజిస్ట్ బి.రజిత అన్నారు. మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్రసంగిస్తూ చక్కటి ప్రణాళికతో చదువుకుంటే ఎట్లాంటి పరీక్షలనైనా సులువుగా రాయవచ్చునని అన్నారు. పరీక్షల ముందు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.


పరీక్షల భయం వల్ల కలిగే ఒత్తిడిని తగ్గించుకోవడానికి చిన్న చిన్న చిట్కాలను పాటించి ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు.

ఉన్నతమైన ఆశయాలు మనల్ని ఉత్సాహవంతంగా తీర్చిదిద్దుతాయన్నారు. స్ట్రెస్ ఫ్రీ కోసం చిన్నచిన్న వ్యాయామాలు చేయాలన్నారు. చదువును చిన్నచిన్న అధ్యాయాలుగా విడగొట్టుకుంటూ చిట్కాల రూపంలో గుర్తు పెట్టుకుంటే అర్థవంతమైన సమాధానాలు రాయవచ్చు అన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని, కలతలు లేని నిద్ర అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగినా పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె .రమాదేవి, కె.రమేష్ బాబులు పాల్గొన్నారు.



## నేషనల్ లైన్ మెన్ డే

**బెజ్జూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
లైన్ మెన్ల సేవలు అభినందనీయమని ఏఈ అంజల్ కుమార్ అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని సెక్షన్ పరిధిలో, వారి కష్టాన్ని గుర్తించడానికి ప్రతి ఏటా మార్చి 4న "నేషనల్ లైన్‌మెన్ డే" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అందేలా చూస్తూ, ప్రాణాలకు తెగించి పనిచేసే లైన్‌మెన్ల పట్ల కృతజ్ఞత తెలపడమే ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు.? విద్యుత్ వ్యవస్థలో లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో పనిచేసే నిజమైన వీరులు అని వారి సేవలను కొనియాఆడారు. ప్రమాదకరమైన పని విద్యుత్ తీగలతో పనిచేయడం ఎంతో ప్రమాదకరమైందన్నారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ లైన్లు తెగిపోయినప్పుడు, యుద్ధ ప్రాతిపదికన వాటిని పునరుద్ధరించేది వారే నని అన్నారు. విద్యుత్ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన లైన్‌మెన్లకు ప్రశంసా పత్రాలు అందజేసి సాల్వాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టే వారి పట్ల గౌరవంగా ఉండటం, విద్యుత్‌ను వృథా చేయకుండా ఉండటమే మనం వారికి ఇచ్చే నిజమైన కృతజ్ఞత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లైన్‌ఇన్స్పెక్టర్ ధర్మయ్య, లైన్మెన్లు బాలాజీ, అశోక్, చరణ్ దాస్,మల్లేష్, ఆపరేటర్లు సంతోష్, శ్రీనివాస్ సిబ్బంది రాకేష్, రమేష్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ రూలర్ మండలంలోని ముజిగి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అడ్డా యూత్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ లను ఉచితంగా అందజేశారు. ఈనెల 14 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పేద విద్యార్థులకు పెన్నులు పాడు పరీక్షల సామాగ్రి అందించినట్లు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు.





## ఇంటికే రాములోరి తలంబ్రాలు

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
భద్రాచలం రాముని ఆలయంలో ఈ నెల 27న శ్రీ రామనవమి సీతారాముల కల్యాణ మహోత్సావ తలంబ్రాలను నేరుగా భక్తుల ఇంటివద్దకే అందచేసేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటున్నట్లు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. బుధవారం స్థానిక బస్ డిపోలో పోస్టర్లను ఆవిష్కరించారు. నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.151తో లాజిస్టిక్ ద్వారా ఈ నెల 31 లోపల బుక్ చేసుకుంటే శ్రీసీతారాముల కళ్యాణం అనంతరం మీ ఇంటి వద్దకే శ్రీసీతారాముల తలంబ్రాలు అందచేయడం జరుగుతుందన్నారు. భద్రాచలం వెళ్లలేని భక్తులు బస్టాండ్‌లో గల ప్రత్యేక కౌంటర్‌లో ముందస్తుగా తలంబ్రాల కొరకు 151/- చెల్లించి బుక్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆ గ్రామంలో కట్నం నిషేధం



**ఇంద్రవెల్లి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లి మండలం దోడంద గ్రామంలో పెళ్లిళ్లలో కట్నం, కానుకలు నిషేధించారు. గ్రామస్థులంతా కలిసి ఇటీవల నిశ్చితార్థమైన కొడప రేణుక కుటుంబానికి రూ.21,000 ఆర్థిక సహాయం అందించారు. గ్రామ పటేల్ మల్కు ఈ విషయాన్ని తెలిపారు. గ్రామస్థుల ఐక్యతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది.

### వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

# విజయవంతానికి పిలుపు




**కాగజ్‌నగర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
విక్సిత్ భారత్ యూత్ పార్లమెంట్ ప్రోగ్రామ్ బుధవారం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, కాగజ్ నగర్ లో విక్సిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలకు సంబంధించి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కి. శ్రీదేవి మాట్లాడుతూ... 50 సంవత్సరాల భారత దేశ అత్యవసర పరిస్థితి-భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు అనే విషయంపై ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. ఈ పోటీలలో 18-25 వయస్సు గల వారు ఎవరైనా పాల్గొనవచ్చని ప్రతి వ్యక్తికి 3 నిమిషాలు సమయం ఇవ్వడం జరుగుతుందని ఈ పోటీలలో పాల్గొనే వ్యక్తులు మై భారత్ పోర్టల్ లో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని లింక్ ద్వారా పాల్గొనవచ్చని, ఇందులో సెలెక్ట్ అయిన విజేతలు స్టేట్ లెవెల్, స్టేట్ లెవెల్ లో సెలెక్ట్ అయిన విజేతలు సెంట్రల్ లెవెల్ లో పోటీ చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ డా.లక్ష్మి నరసింహం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ, కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ శారద పాల్గొన్నారు.

### సెంట్రల్ ఫోర్స్‌లో అక్కచెల్లెళ్లకు

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

**జన్నారం, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
సెంట్రల్ ఫోర్సులో ఉద్యోగాలు సాధించిన మండలంలోని పొనకల్ గాంధీనగర్ కు చెందిన అక్క,చెల్లెళ్లను పలువురు శాలువాలు కప్పి సన్మానించారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ గాంధీనగర్ వాసి బొమ్మిడి రాజేందర్-సుజాత దంపతుల ఇద్దరు కుమార్తెలు శ్రావ్యరాణి, ప్రవళికలు సీఐఎస్ఎఫ్, ఐబీసీఎఫ్ సెంట్రల్ ఫోర్సులో ఉద్యోగాలు సాధించి శిక్షణ పూర్తి చేసుకొని ఒకరు ఢిల్లీలో,మరొకరు జమ్మూ కాశ్మీర్ ఉద్యోగంలో చేరారు. ఇంటికి వచ్చిన ఆ ఇరువురు ఉద్యోగులను హరిత రిసార్ట్ ఆవరణలో ఆ రిసార్ట్ మేనేజర్ వీరేందర్ శాలువాలు కప్పి సన్మానించారు. అదే ఉద్యోగులను మహేంద్ర యువజన సంఘం అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలువేరి సుధీర్ కుమార్, గౌరవాధ్యక్షులు పర్ల శంకర్,పోతు సురేష్ శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పలువురు హరిత రిసార్ట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



### హోలీ వేడుకల్లో విషాదం

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**జైనూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
హోలీ పండుగ రోజున కుటుంబంతో సంతోషంగా గడపడానికి హైదరాబాద్ నుంచి బయలుదేరిన గేడం సునిల్ కుమార్ (34) ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం సోన్పటేల్ గూడాకు వస్తుండగా, మంగళవారం ఉట్నూరు మండలం హస్నాపూర్ సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. తీవ్ర గాయాలపాలైన సునిల్ కుమార్‌ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిండు గర్భిణిగా ఉన్న భార్య, వృద్ధ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు గ్రామంలో విషాద ఛాయలు నింపాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# విద్యుదాఘాతంతో రైతు మృతి



**లక్ష్మణచందా, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
మండలంలోని నర్సాపూర్ డబ్ల్యూ గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి రైతు మృతి చెందిన సంఘటన గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన కయితీ రవీందర్ రెడ్డి (48), తండ్రి రాజారామ్, తన మొక్కజొన్న పంటను అటవీ జంతువుల నుండి రక్షించేందుకు పొలం చుట్టూ బైండింగ్ వైర్‌కు కరెంట్ కనెక్షన్ ఏర్పాటు చేసుకున్నాడు. రోజువారీలా శుక్రవారం తన పొలం వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు అదే విద్యుత్ తీగ అతని కాళ్లకు తగిలింది. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురైన రవీందర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రావణి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.



# అక్రమ కేసులకు భయపడను

### చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి విడుదల

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడే ప్రసక్తే లేదని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టం చేశారు. మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి ఘటనలో అరెస్టయిన ఆయన, 16 రోజుల జైలు శిక్ష అనంతరం బుధవారం ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుమన్ మాట్లాడారు. క్యాతన్‌పల్లి మునిసిపాలిటీలో ప్రజలు బీఆర్ఎ?స–సీపీఐ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఇచ్చారని, 22 వార్డులకు గాను తమ కూటమి 14 చోట్ల విజయం సాధించిందని గుర్తుచేశారు. 7 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ, మంత్రి వివేక్ అండతో చైర్మన్ పదవి కోసం దౌర్జన్యం చేసిందని ఆరోపించారు. తమ కౌన్సిలర్లను భద్రాచలంలో పోలీసులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని, చైర్మన్ ఎన్నికను అడ్డుకుని అన్యాయానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును ప్రశ్నించినందుకే తనపై అక్రమ కేసులు బనాయించి, ఇన్ని రోజులు బెయిల్ రాకుండా అడ్డుకున్నారని సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, బాల్క సుమన్‌పై నమోదైన పలు కేసుల విషయంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఆరోపణలపై చెన్నూరులో నమోదైన కేసు (ఎఫ్ఐఆర్ 37), రాయదుర్గంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు నమోదైన కేసులను కొట్టేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో వేర్వేరు క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.సుజన ధర్మాసనం.. పూర్తి వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ఫిర్యాదుదారులకు, పోలీసులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

# సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దు

### పెద్దమ్మతల్లి విగ్రహ ధ్వంసంపై తప్పుడు ప్రచారం బోథ్ సిఐ బోథ్ సీఐ గురుస్వామి

**బోథ్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

రెండు రోజుల క్రితం భీంపూర్ మండలంలో జరిగిన పెద్దమ్మ తల్లి విగ్రహ ధ్వంసం ఘటనపై సోషల్ మీడియా ఇంస్టాగ్రామ్ నందు అనుచిత వాక్యాలు చేసిన బోథ్ పట్టణానికి చెందిన యువకుడు జాదవ్ వినోద్ (28) పై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ డి గురుస్వామి తెలిపారు. అనుచితంగా వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టేలా ప్రవర్తించినందుకుగాను బోథ్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి సెల్ఫోన్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని బోథ్ సీఐ డి గురుస్వామి తెలిపారు. ప్రజలు పుకార్లను నమ్మవద్దని బోథ్ సిఐ డి గురుస్వామి తెలిపారు.



సోషల్ మీడియా నందు రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు వ్యక్తులు వాట్సప్ నందు మరియు ఇంస్టాగ్రామ్ ఫేస్బుక్ లాంటి సామాజిక మాధ్యమాలలో ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారని, వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాలను గమనించేందుకు ప్రత్యేక బృందం ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. కొందరు వ్యక్తులు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తూ ఇరు వర్గాల మధ్య గొడవలకు దారి తీసేలా ప్రవర్తించినట్లయితే పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు.



### చెరువుల మరమ్మత్తులకు

# రూ.1.50 కోట్ల నిధులు మంజూరు

**ముథోల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

ముధోల్ నియోజకవర్గంలోని ఐదు చెరువుల మరమ్మత్తులకు రూ. 1.50 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బుధవారం తెలిపారు. కుంటాల మండలం దౌనెల్లి గ్రామ చెరువుకు రూ. 34.50 లక్షలు, అందకూర్ గ్రామ పెద్ద చెరువుకు రూ. 22.20 లక్షలు, పెంచికల్ పాడ్ గ్రామంలో గోధుమ కుంట చెరువుకు రూ. 22.15 లక్షలు, కల్లూరు గ్రామ పెద్ద చెరువుకు రూ. 33.60 లక్షలు, కుభీర్ మండలం హంపోలి గ్రామ చెరువుకు రూ. 39.50 లక్షలు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# జన్నారంలో ఘనంగా హోలీ

**జన్నారం, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలకేంద్రం లో బుధవారం రోజున హోలివేడుకలు ఘనంగా నిర్వహించారు చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం రాంనగర్ లోనే మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



### కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో

# ఘనంగా హోలీ వేడుకలు

### ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, బుధవారం సాయంత్రం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ హోలీ వేడుకలలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా ఎస్పీ కార్పొరేషన్ ఈడి మనోహర్, సంక్షేమ అధికారి మిల్కా, డిపిఓ రమేష్, డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డివైఎస్ఓ శ్రీనివాస్, ఎల్డియం ఉత్పల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పిడి రాజు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ, హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లాలో పలు చోట్ల



బుధవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబురాలు జరుపుకున్నారు.

### పదవీ విరమణ పొందిన

# ఉపాధ్యాయులకు సన్మానం

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**



ఫిబ్రవరి 28న పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఆత్మీయ సన్మాన కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో భోజన్న తెలిపారు. ఇందులో భాగంగా ఉపాధ్యా యులను ఘనంగా సన్మానించి రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్ సంతకంతో కూడిన ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# పెరిగిన కరువు భత్యం చెల్లించాలి

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన కరువు భత్యం వెంటనే చెల్లించాలని ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. బుధవారం బీడీ కార్మికుల సమావేశంలో పాల్గొన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు గాను ఐదు పాయింట్ రూ.5.50 కరువు బత్యం పెరిగిందని దాన్ని వెంటనే యాజమాన్యాలు చెల్లించాలన్నారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బక్కన్నగంగన్న గఫూర్ లక్ష్మీ తదితరులున్నారు.



# అమ్మని కడసారి చూసుకునేందుకు నాన్నని రప్పించరూ.!!

### నిజామాబాద్ జిల్లాలో అనారోగ్యంతో భార్య మృతి - విమానాలు లేక దుబాయ్‌లో ఉండిపోయిన భర్త - తండ్రి రాక కోసం పిల్లల ఎదురుచూపులు

**మెండోరా, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

వారిద్దరూ ఇంటర్మీడియట్ విద్యార్థులు.. అనారోగ్యం కారణంగా వారి తల్లి మరణించింది. ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం దుబాయ్ వెళ్లిన తండ్రి ప్రస్తుతం విమానాలు లేక అక్కడే ఉండిపోయారు. అమ్మ లేదు.. కష్టసమయంలో తోడుగా నిలిచేందుకు పక్కన తండ్రి లేడు. దీంతో ఆ పిల్లలు దిక్కుతోచని స్థితిలో నిలిచారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం సావెల్ గ్రామానికి చెందిన నూకల లక్ష్మీనర్సు(40) అనారోగ్యం వల్ల బుధవారం మరణించింది. ఆమె భర్త లింబాద్రి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. భార్య మరణ వార్త విన్న వెంటనే స్వగ్రామానికి రావాలని లింబాద్రి ప్రయత్నించినా.. యుద్ధం నేపథ్యంలో దుబాయ్ విమానాశ్రయం మూసివేయడంతో కష్టంగా మారింది. అబుదాభీ నుంచి భారత్‌కు వచ్చే అవకాశాలున్నాయని సమాచారం. అయితే, తల్లిని కోల్పోయి శోకంలో ఉన్న లింబాద్రి కుమారులు.. తమ తండ్రి స్వదేశానికి వచ్చే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని వేడుకుంటున్నారు. అమ్మను కడసారి చూసుకునే అవకాశాన్ని నాన్నకు కల్పించాలని కోరుతున్నారు.

# వసంత వేళ.. రంగుల హేల



**వైభవంగా హోలీ వేడుకలు**
**హోలీ హంగామా**
**రంగుల జాతరలో తడిసిముద్దైన జనం!**
**పల్లెల్లో పండుగ జోరు**

**కాగజ్‌నగర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో పలు చోట్ల బుధవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకుకున్నారు. కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు నివాసంలో బుధవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ హోలీ పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. బీజేపి నాయకులు, కార్యకర్తలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విశ్వేశ్వర్ రావు, మాజీ ఎంపిపి మనోహర్ గౌడ్, నాయకులు సిందం శ్రీనివాస్, చిప్పకుర్తి శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, పొలాడి హన్మంతరావు, చిలువేరు ప్రవీణ్, అరుణ్ లోయా తదితరులు పాల్గొన్నారు. పెంచికలపేట మండలంలో బుధవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఎల్లురు తదితర గ్రామల్లో హోలీ సంబరాలను చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఎస్సై అనిల్‌కుమార్ గౌడ్ వేడుకల్లో పాల్గొని యువకులతో కలిసి నృత్యం చేశారు. మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, రవీందర్, నాయకులు చంద్రమౌళి, నాగన్న, శంకర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు. దహెగాం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో యువతీ యువకులు నృత్యాలు చేస్తూ సంబరాలు నిర్వహించారు. జైనూర్ మండలంలోని మానిగూడ పంచాయతీలో గల రాంనగర్, అల్లిగూడ, జండాగూడ తదితర గ్రామాల్లో బుధవారం హోలీ వేడుకలను యువకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై



మరొకరు రంగులు చల్లుకున్నారు. ఆదేవిధంగా ఇంటింటికి జాజిరి ఆడుతూ ఆటలు పాటలు, డప్పుల చప్పుళ్ళ మధ్య నృత్యాలు చేశారు. మంగళవారం చంద్ర గ్రహణం సందర్భంగా కొన్ని గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించలేదు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, జాదవ్ గణపత్, యువకులు తదితరులు పాల్గొన్నారు. లింగాపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని తండాలు, గూడాల్లో హోలీ పండుగను ప్రజలు ఆటా పాటలతో ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ సందడి చేశారు.



**ముథోల్ నియోజకవర్గంలో...**

**కుభీర్ :** భైంసా డివిజన్ పరిధిలోని కుభీర్, భైంసా, తానూర్ రైతుల మండలాల్లో బుధవారం హోలీ పండుగను జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు సల్లుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో హోలీ ఉత్సవ ర్యాలీలు నిర్వహించారు. పార్టీ కేలో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందెల సత్యనారాయణ మాట్లాడుతూ... హిందూ పురాణ కథ ప్రకారం చెడుపై మంచి గెలిచిన దానికి సంకేతం హోళి అన్నారు. గోడపూర్ లో సర్పంచ్ దత్త హరి పటేల్, నాయకులు ఆయా గ్రామాల ప్రజలు యువకులు పాల్గొన్నారు.

**లక్ష్మణచందా :** మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. చంద్రగ్రహణం కారణంగా రెండోరోజు ఘనంగా బుధవారం లక్ష్మణ చందా వడ్డాల్ కనకాపూర్ బాగాపూర్ నర్సాపూర్ తదితర గ్రామాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



## విద్యుత్ ఉద్యోగుల పని ప్రతిజ్ఞ

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
విద్యుత్ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని ఎంపీటీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ నాగరాజు అన్నారు. బుధవారం శాఖ కార్యాలయంలో విద్యుత్ లైన్మెన్ దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉత్తమ లైన్మెన్ సన్మానం చేసి ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డిఇ వెంకటేశ్వర్లు, పట్టణ ఏడి ఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సమస్య లేకుండా చర్యలు

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
వేసవిలో మంచినీటి సమస్యను నివారించడానికి చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ ఆత్రం నగేష్ తెలిపారు. బుధవారం సాత్నాల మండలం సాంగ్వి గ్రామంలో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద రూ. లక్ష నిధులతో మంచినీటి బోర్ వేయించారు. గ్రామంలో మొత్తం నాలుగు బోర్లు మంజూరు అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ విట్టల్, మధుర రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక వసతుల కల్పనకు చర్యలు



**కుమ్రంభీం జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్**

**ఆసిఫాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీలకు విడుదలైన నిధులతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్‌లు, జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్యాదేవరాజన్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పనులు, తాగునీటి సరఫరాను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఆ నిధులతో గ్రామ పంచాయతీలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీలలో అత్యవసర పనులకు నిధులు ఖర్చు చేయాలని గత పంచాయతీ పాలక వర్గంలో సర్పంచ్‌లు చేసిన పనుల పూర్తి రికార్డులు సమర్పించినట్లయితే వాటికి నిధులు కేటాయించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో ఉమర్ హుస్సేన్, హరిప్రసాద్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు విడుదలైన నిధులతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీరు అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. పంచాయతీలలో రహదారుల మరమ్మతుల, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామ సమాఖ్య భవనాలు, పంచాయతీ నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రజ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

**మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**

**ఆసిఫాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ పట్టణంలోని 17వ వార్డు జామా మస్జిద్ సమీపంలో గత కొన్ని రోజులుగా వాటర్ మోటర్ చెడిపోవడంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని బుధవారం స్థానికులు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించారు. ప్రజా సమస్య పట్ల మానవత్వంతో వ్యవహరించిన ఆయన, ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా తన సొంత ఖర్చులతో మోటార్‌కు మరమ్మత్తులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ ప్రజా సేవయే పరమావధిగా పనిచేస్తామని, ప్రతి ఒక్కరికీ తాగునీరు అందేలా చూడటం తన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తమ విన్నపంపై వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన వైస్



చైర్మన్ ఎండీ అహ్మద్‌కు కాలనీవాసులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గంధం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, షబ్బీర్, రాజుతో పాటు కాలనీవాసులు తాహెర్ హుస్సేన్, బాబా, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ క్రీడ పాఠశాలలో 2026-27 సంవత్సరగాను ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. 4వ తరగతి చదివిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను వచ్చే నెల 13 వరకు స్వీకరిస్తామని ఆ తర్వాత కౌన్సిలింగ్ ప్రవేశాల కల్పన చేపట్టనున్నట్టు తెలిపారు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్విని చూసుకోవాలన్నారు.






## మంత్రి వివేక్‌కు 'ఐ లవ్ యూ' అంటూ
# బాల్క సుమన్ చమత్కారం

**ప్రజా తీర్పును గౌరవించని మంత్రి**
**నాపై అక్రమ కేసులు బనాయించారు మీరు**

**రామకృష్ణాపూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. మంత్రి వివేక్ కారు పై దాడి కేసులో అరెస్టై, పక్షం రోజుల పాటు ఆదిలాబాద్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు సంయుక్తంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారని, అయితే 16న జరగాల్సిన చైర్మన్ ఎన్నిక కోరం లేక వాయిదా పడిందని తెలిపారు. 17న కోరం ఉన్నప్పటికీ కేవలం కౌన్సిలర్ల ప్రమాణస్వీకారమే నిర్వహించారని, చైర్మన్ ఎన్నికను ఎందుకు వాయిదా వేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆ రోజు జరిగిన ఘటనల సీసీ ఫుటేజ్‌ను ప్రజలకు విడుదల చేయాలని ఎన్నికల కమిషనర్‌ను కోరారు. బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్ బబ్బేర స్వర్ణలతను లోపలికి అనుమతించలేదని, దీంతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీతో కలిసి రోడ్డుపై బైఠాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నేతలే మొదట దాడి చేశారని, అయితే వారిపై కేసులు నమోదు కాలేదని ఆరోపించారు. జిల్లాలో పోలీసులు కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. జైలులో ఉన్న సమయంలో కనీస సదుపాయాలు కల్పించలేదని, మూడు రోజుల పాటు దుప్పటి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**చైర్మన్ ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలి...**

సీసీ ఫుటేజ్‌ను రెగ్యులర్‌గా మానిటర్ చేసిన మంత్రి వివేక్‌కు 'ఐ లవ్ యూ' అంటూ చమత్కరించారు. వారెంట్ లేకుండా తన ఇంట్లో సోదాలు జరిపిన రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్‌పై కూడా మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో మెజార్టీ ఉన్నవారికే చైర్మన్ పదవి దక్కాలని, క్యాతనపల్లిలో 22 వార్డుల్లో 14 వార్డులు బీఆర్ఎస్--సీపీఐ గెలిచినప్పటికీ, 8 వార్డులు గెలిచిన కాంగ్రెస్ చైర్మన్ పదవిని ఎలా పొందుతుందని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, డీసీపీ ప్రభుత్వానికే కాక ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వ్యవహరించి చైర్మన్ ఎన్నికను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ, బీఆర్ఎస్--సీపీఐ పొత్తులో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై ముందే అవగాహన కుదిరిందని చెప్పారు. ప్రజల కోసం జైలుకు వెళ్లిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, రామగుండం బీఆర్ఎస్ ఇంచార్జ్ కౌశిక్ హరి, జెడ్పీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, సీపీఐ జిల్లా అధ్యక్షుడు కలవేణి శంకర్, ఇతర పార్టీ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## లైన్‌మెన్‌ల సేవలను గుర్తించాలి

**దండేపల్లి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

దండేపల్లి మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ కార్యాలయంలో లైన్మెన్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖకు లైన్మెన్లు వెన్నెముక లాంటి వారని, నిరంతర విద్యుత్ సరఫరా కోసం వారు పగలు, రాత్రి శ్రమిస్తున్నారని ఏఈ బాపు అన్నారు. వారి కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బందిని సన్మానించి, ప్రశంస పత్రాలు అందజేశారు. విద్యుత్ భద్రతా ప్రమాణాలపై ప్రతిజ్ఞ చేశారు. సబ్ ఇంజనీర్ సాయి నరేష్, పలువురు లైన్మెన్లు పాల్గొన్నారు.

## చెన్నూర్‌లో అగ్నిప్రమాదం

**చెన్నూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

చెన్నూరు పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో వాటర్ ట్యాంక్ పైపులకు నిప్పు అంటుకొని భారీ మంటలు, దట్టమైన పొగ చెలరేగడంతో కలకలం రేగింది. సమాచారం అందుకున్న చెన్నూరు పట్టణ సీఐ, ఫైర్ సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు 400 పైపులు దగ్ధమై, సుమారు 20 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

# నిర్మల్ మున్సిపాలిటీలో పర్యాటక అభివృద్ధి

**నిర్మల్ పట్టణ అభివృద్ధికి సహకరించండి**
**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన**
**మున్సిపల్ చైర్మన్ కావ్య గణేష్ చక్రవర్తి**

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ మున్సిపాలిటీ పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నిర్మల్ మున్సిపల్ అభివృద్ధి పర్యాటకంగా చేపట్టవలసిన చర్యలపై నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ అప్పల కావ్య గణేష్ చక్రవర్తి దంపతులు జిల్లా ఇన్చార్జి మంత్రిని కలిశారు. చైర్ పర్సన్ దంపతులతో పాటు కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాచారి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీహరిరావు మంత్రిని కలిశారు. వారికి మంత్రి శాలువాతోసన్మానం చేశారు. నిర్మల్ పట్టణంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని దీనికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపాలని మంత్రి చైర్‌పర్సన్ దంపతులకు సూచించారు.



నిర్మల్ మున్సిపాలిటీలో విజయం సాధించిన సందర్భంగా ప్రత్యేక అభినందించారు. నిర్మల్ అభివృద్ధి తోపాటు పట్టణంలోని చారిత్రకమైన శ్యామఘడ్, బత్తిస్‌ఘడ్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు చైర్మెన్ అప్పాలకావ్య గణేష్‌చక్రవర్తిలు పేర్కొన్నారు.

# అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

**తాండూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తాండూరు(వీ) కిష్టంపేటకు చెందిన శాంత(28) అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే ప్రసవం జరిగింది. తాండూరు 108 సిబ్బంది ఈఎంటి శివకుమార్, పైలెట్ తిరుపతి, వైద్యుని సూచన మేరకు అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేయగా ఆడబిడ్డ జన్మించింది. అనంతరం తల్లీబిడ్డలను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన 2026 మార్చి 4న చోటుచేసుకుంది.





### కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో
## 12న చలో ఢిల్లీ కార్యక్రమం
### పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి వివేక్

**మంచిర్యాల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న వందలాది డప్పు కళాకారులతో మహాధర్నా చేసేందుకు 'చలో ఢిల్లీ'కి కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ సచివాలయంలో కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా 'చలో ఢిల్లీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల సాధనకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాస్తానని మంత్రి హామీనిచ్చినట్లు పేర్కొన్నారు.

## బైకు అదుపుతప్పి యువకునికి గాయాలు

**మామడ, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

మామడ మండలం కొరటికల్ గ్రామ ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఈఎంటీ సురేష్, పైలెట్ హాఫిజ్ ఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



# అందరి సమన్వయంతో కార్పొరేషన్ అభివృద్ధి

**మంచిర్యాల మేయర్ ధర్ని మధూకర్**

**మంచిర్యాల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్‌కార్పొరేషన్ పరిధిలోని అధికారులు, ప్రజల సమన్వయంతో మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధి సాధ్యమని మంచిర్యాల మేయర్ ధర్ని మధూకర్ అన్నారు. బుధవారం మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌తో కలిసి 'మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత' అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. శానిటేషన్ పట్టణ ప్రణాళికలో భాగంగా 60 నుంచి 70 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రెండురోజుల పాటు మూడు డివిజన్ల చొప్పున వార్డుల్లో మున్సిపల్ అధికారులతో పాటు శానిటేషన్ సిబ్బంది డివిజన్ కార్పొరేటర్లతో వార్డుల సమస్యలు ముఖ్యంగా పారి శుధ్యం, మంచినీటి సమస్య రోడ్లు, గుంతలు, లైటింగ్ ఇతర సమస్యలను గుర్తించడం వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు నేరుగా గాని, పత్రికముఖంగా కాని సమస్యలు తెలియజేయాలని సమస్యలపై వెంటనే స్పందిస్తామన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడపడేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మంచిర్యాల కార్పొరేషన్‌ను ఆదర్శంగా నిలిపేందుకు ఎమ్మెల్యే సహకారంతో నంబరు వన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కొత్త లైట్లు, కొత్త రోడ్లు వంటి వాటిని పరిశీలిస్తామన్నారు. ప్రజలు, అధికారులు సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక విధి విధానాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కార్పొరేటర్లు తూముల నరేశ్, చింతపండు శ్రీనివాస్, సురమల్ల హరి క్రిష్ణ, సల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి గనుల్లో 'ఊపిరి' ఆడని వైనం

- స్పృహతప్పిన కార్మికుడు!
- శాంతిఖనిలో రక్షణ గాలి కరువు
- మృత్యుకుహరంలో బొగ్గు కార్మికులు!
- గనిలో అన్వేష్‌కు తృటిలో తప్పిన ప్రమాదం
- వెంటిలేషన్ ఆఫీసర్ నిర్లక్ష్యమే కారణమా?
- గాలి అందక ఆసుపత్రి పాలైన కార్మికుడు!



**బెల్లంపల్లి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

సింగరేణి బొగ్గు బావుల్లో ఊపిరాడని పరిస్థితి కార్మికుల ప్రాణాలకు పెనుముప్పుగా మారింది. భూగర్భగనిలో కనీస గాలి సరఫరా చర్యలపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందుకు నిదర్శనంగా శాంతిఖనిలో మొదటి షిఫ్టులో పని చేస్తున్న ఒక కార్మికుడు ఊపిరాడక కింద పడిపోయి నా సంఘటన ఉదాహరణగా పేర్కొనవచ్చు. అధికారుల పర్యవేక్షణ భూగర్భగనుల్లో కనీస సదుపాయాలు లేక కార్మికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. గాలి, నీరు వంటి ప్రధాన వసతులు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, స్థానిక అధికారుల నిర్లక్ష్యం వెరసి గనుల్లో కార్మికుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. శాంతిఖని గనిలో47 లెవెల్‌లో బుధవారం సపోర్ట్ పనులు చేస్తున్న అన్వేష్ అనే బదిలీ కార్మికుడు ఊపిరి అడక స్పృహ తప్పాడు. అతనితో పని చేస్తున్న తోటి కార్మికులు వెంటనే కానీ ఉపరితలానికి తీసుకొచ్చారు. పని స్థలాల్లో ముందస్తుగా ట్రక్చర్ ఏర్పాటు చేస్తారు. కానీ ఆ కార్మికుడు పనిచేస్తున్న పని స్థలంలో అటువంటి సదుపాయం లేదు. సంఘటన తర్వాత అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్ట్రెచ్చర్‌పంపించారు. అప్పటి వరకూ అక్కడే కార్మికుడు ఉండిపోయారు. స్పృహ తప్పిపడిపోయిన కార్మికుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**అధికారుల పర్యవేక్షణ లోపం..**

భూగర్భగనుల్లో రక్షణ, గాలి తాగునీటి కనీస మౌలిక సదుపాయాలు ఉండాలి. ఈ పని స్థలాల్లో కార్మికులకు మౌలిక వసతులు కల్పించడం అధికారుల బాధ్యత. ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించాలి. ఇలా జరిగినప్పుడే కార్మిక ప్రాణాలకు భద్రత ఉంటుంది. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ సాఫీగా సాగుతుంది. గనుల్లో కనీస సదుపాయాలు లేకపోయినా కార్మికుల తోటి అధికారులు పనులు చేపించడం సింగరేణిలో పరిపాటిగా మారింది. కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తిని తీయాలని చూడటం అధికారులకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలోనే భూగర్భగనుల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. ఊపిరాడని, రక్షణ లేని తీవ్ర వేడి వాతావరణంలో పని స్థలాలు కూరుకుపోయాయి. ఈ పరిస్థితి అధికారుల నిర్లక్ష్యం వల్లనే నెలకొందన్న ఆరోపణలు ఉన్నాయి. రక్షణ గాలి తాగు నీరు సక్రమంగా పని స్థలాల్లో సమకూర్చడం అధికారుల విధుల ప్రధాన లక్ష్యం గా సాగించాలి. కానీ గనిలో ఓ కార్మికుడు ఊపిరాడని పరిస్థితిలో పనిచేస్తూ స్పృహ కోల్పోవడం అధికారులు, ప్రధానంగా వెంటిలేషన్ అధికారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతుంది. పని స్థలాలు నరక కూపంగా తలపిస్తున్నాయి. కార్మికులు ప్రతిరోజు గాలి నీరు రక్షణ వంటి ప్రధాన చర్యలపై సంబంధిత అధికారులకు గుర్తు చేస్తూనే ఉంటారు. అయినప్పటికీ అధికారులు విడిచి ఏమైనా పెట్టడం వల్లనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల బాధ్యతరహిత్యం కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారాయి. కార్మికుల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## కుల పెద్దల మాట వినలేదని
# కుటుంబ బహిష్కరణ

### గత ఏడేళ్ల నుంచి కుల పెద్దల వేధింపులు
### చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుల ఫిర్యాదు

**వాంకిడి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

కుల పెద్దల మాట వినలేదని కుల బహిష్కరణ చేసిన సంఘటన వాంకిడి మండలంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్‌పేట మండలానికి చెందిన పెండెష్‌తో వాంకిడి మండలానికి చెందిన లావణ్యతో 2016లో వివాహం జరిగింది. అయితే లావణ్య తల్లిదండ్రులకు ఒకే ఆడబిడ్డ కావడంతో అల్లుడిని ఇల్లరికం తీసుకొచ్చి.. మామ వాంకిడిలో బార్బర్ (కటింగ్) షాపు పెట్టించాడు. తమ అనుమతి లేకుండా షాపు పెట్టడం పై మంగళి కుల పెద్దలు ఆక్షేపించారు. ఆపై షాపులో నాలుగు కుర్చీలు కాకుండా రెండు కుర్చీలు పెట్టాలని చెప్పారు. కుల పెద్దల మాట వినక పోవడంతో ఏడేళ్ల నుంచి తమ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసి.! ఎవరి ఇంట్లో శుభకార్యం ఉన్న తమను పిలవకుండా.! తమ ఇంటికి రానివ్వకుండా కుల పెద్దలు వేధింపులకు గురి చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వాంకిడి పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

# బాల్క సుమన్ ఘన స్వాగతం



**జన్నారం, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

బుధవారం ఆదిలాబాద్ జిల్లా జైలు నుండి విడుదలైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గత 14 రోజులుగా రిమాండ్‌లో ఉండి విడుదలైన బాల్క సుమన్ జన్నారం మీదుగా మంచిర్యాల వెళుతుండగా జన్నారం మండలంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు బాల్క సుమన్ మాట్లాడుతూ పదేళ్ల తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని కానీ ఇప్పుడున్న ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

# డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

**నేరడిగొండ, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైబర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందారు. ఈ ఘటన రోల్ మామడ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం బుద్ధికొండ గ్రామానికి చెందిన లింగంపల్లి లక్ష్మణ్ (21) నిర్మల్ జిల్లాలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. హోలీ పండుగ వేళ స్వగ్రామం బుద్ధికొండకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మంగళవారం అర్ధరాత్రి అతను ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి డివైబర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

# కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకలు



**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, బుధవారం సాయంత్రం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ హోలీ వేడుకలలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ సాయికిరణ్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హోలీ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, కొత్త వెలుగును నింపాలని ఆమె ఆకాంక్షించారు. విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి ఇటువం టి వేడుకలు మానసిక ఉల్లాసాన్ని, పరస్పర ఐక్యతను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ, హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

**ఉట్నూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

పట్టపగలే వెలిగే వీధి దీపాలు గ్రామ పంచాయతీల నిర్వహణ లోపాలని ఎత్తు చూపిస్తున్నాయి. పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలను అర్పించుటకు చాలా గ్రామ పంచాయతీ కేంద్రాలతో పాటు అనుబంధ గ్రామాల్లో స్విచ్ ఆన్ చేసే తీగలు కరువయ్యాయి. దీంతో చాలా మేరకు విద్యుత్తు వృధా కావడంతో పాటు గ్రామ పంచాయతీలపై కరెంటు బిల్లుల భారం పడుతుంది. ప్రతి గ్రామంలో 50 నుంచి 300 వరకు వీధి దీపాల స్తంభాలు ఉన్నాయి. ఇందులో చాలా వరకు 24 గంటలు వెలుగుతున్నాయి. దీంతో అనవసరపు విద్యుత్ వినియోగంతో విద్యుత్ వృధా అవుతుంది. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్ జాదవ్ మాట్లాడుతూ.. వీధి దీపాల నిర్వహణలో భాగంగా చాలా పంచాయితీలో సరియైన స్విచ్ బోర్డు లేకపోవడం, స్విచ్ బోర్డ్‌ల ఏర్పాటుపై పంచాయితీ అధికారులు దృష్టి సారించడం లేదని వాపోయారు. 24 గంటలు విద్యుత్తు దీపాలు వెలగడంతో పంచాయతీలపై కరెంటు బిల్లుల భారం పడుతుందని సర్పంచులు, కార్యదర్శులు వీధి దీపాలకు స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు.






## అంగన్వాడీ కేంద్రంలో
# నాగుపాము కలకలం

**బేల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

బేల మండల కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీలో పాము కలకలం సృష్టించింది. బుధువారం అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులు మధ్యాహ్నం భోజనం తిన్న అనంతరం పక్కనున్న రూమ్ లో నాగుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. టీచర్, పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకొని పామును పట్టుకున్నారు. దీంతో అంగన్వాడీ టీచర్, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పాము విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.



# ఘనంగా హోలీ సంబరాలు

**కుభీర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నిగ్వ, పార్డి (కె) గోడపూర్ తదితర గ్రామాలలో యువకులు రైతులు, విద్యార్థులు ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. పార్టీ కే లో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందెల సత్యనారాయణ మాట్లాడుతూ హిందూ పురాణ కథ ప్రకారం చెడుపై మంచి గెలిచిన దానికి సంకేతం హోలీ పండుగ అని అన్నారు. గోడపూర్‌లో సర్పంచ్ దత్త హరి పటేల్, నాయకులు, గ్రామాల ప్రజలు, యువకులు హోలీ వేడుకల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు.

# ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యకాండ ఆపాలి

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యకాండ ఆపకుంటే మరో పోరాటం తప్పదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ హెచ్చరించారు. బుధవారం మావల మండలం లోని కుమురంభీం గూడలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి జిల్లా లోని దూదేకులపల్లి రేంజ్ సింగారం బీట్ కాల్వప ల్లిలో 25, 30 ఏళ్లుగా ఆదివాసీ కుటుంబాలు 162 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నార న్నారు. అట్టి భూమిలో అటవీశాఖ అధికారులు జేసీబీలతో కందకాలు తవ్వడాన్ని వెంటనే నిలిపివే యాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ వెంటనే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా సాగు చేస్తున్న అటవీ భూములకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక,



ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, నాయకులు వెడ్మ ముకుందరావ్, తొడసం ప్రకాష్, నాగోరావ్, గోవిందల్లవ్, పాల్గొన్నారు.



### నరసింహుని సన్నిధిలో
## గోవుల మృత్యుఘోష

**దిలావర్‌పూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన కోడెలను దేవదాయ శాఖ నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పటి వరకు గోశాలలో 15 కోడెలు మృతి చెందాయి. చనిపో యిన కోడెలను ఖననం చేయడం తప్ప సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమైన ఇంచార్జీ ఈవో భూమయ్యను వివరణ కోరగా గోవులు పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం వల్ల అనారో గ్యంతో మృతి చెందుతున్నాయని తెలిపారు.

## 20 క్వింటాళ్ల పత్తి దగ్ధం

**మందమర్రి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

మందమర్రి మండలంలోని పొన్నారంలో పెంచాల బాపుకు చెందిన సుమారు ఇరవై క్వింటాళ్ల పత్తి దగ్ధ మైంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలకు 12 ఎకరాల చేనులో ఏరిన సుమారు 45 క్విం టాళ్ల పత్తిని ఇంటివద్ద నిల్వ చేశారు. బుధవారం తెల్లవారు జామున వాసన రావడంతో బయటకి వచ్చి చూడగా పత్తి తగలపడుతు న్నట్లు గుర్తించారు. వెంటనే చుట్టుపక్కల వారిని నిద్రలేపడంతో మంటలు ఆర్పివేశారు. పత్తి కుప్ప వద్ద సగం వరకు పెట్రోల్ ఉన్న చిన్న థమ్సప్ బాటిల్ లభించినట్లు తెలిపారు. సర్పంచ్ పెంచాల మధు సమాచారంతో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యా దు చేసినట్లు బాధితులు తెలిపారు.

## యువతిని మోసగించిన వ్యక్తి రిమాండ్

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

యువతిని మోసగించిన కేసులో పట్టణంలోని అశోకోడ్‌కు చెందిన బోయిని గౌతంను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. తలమడుగు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి,నిరాకరించడంతో ఆమె ఫిర్యాదు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

## చోరీ కేసులో ఒకరి అరెస్టు

**ముథోల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

బెల్గరోడా గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో హుండీ డబ్బులు దొంగిలిం చిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. 2025 మార్చి 24న రాత్రి మహారాష్ట్రలోని రాఠి గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న రూ.10 వేలు దొంగిలించాడు. నిందితుడు మహారాష్ట్రలోని రాఠి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గా గుర్తించారు.

## ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు

**ఆసిఫాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

దహెగాం మండలం ఐనం గ్రామానికి చెందిన చౌదరి శ్యాంరావు బుధవారం దహెగాం ఎస్సై విక్రమ్ కుమార్‌పై ఎస్పీ నితికా పంత్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు శ్యాంరావు భార్యపై అదే గ్రామానికి చెందిన రమేశ్ దాడికి పాల్పడ్డాడని, ఈ విషయమై మార్చి 2న ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా విషయం తెలుసుకున్న రమేశ్, మరోవ్యక్తి హరిబాబు కూడా స్టేషన్‌కు వచ్చారు. ఎస్సై ముందే హరిబాబు కొడుతుండగా ఎస్సై ఆపకుండా కొట్టడంతో పాటు దుర్భాషలాడినట్లు పేర్కొన్నాడు.

# ఈ నెల 7న వికసిత్ భారత్ యువ కనెక్ట్

**నిర్మల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాల లో ఈ నెల 7న వికసిత్ భారత్ యువ కనెక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అఖిలేశ్ కుమార్ సింగ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి పోటీలను వశిష్ట డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాలకు కళాశాల సమన్వయకర్త రవి, సెల్ 9912039609 సంప్రదించాలని సూచించారు.






# కొలాంగూడలో వెయ్యేళ్లనాటి శిల్పాలు



**ఖానాపూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

క్రీస్తు శకం 11వ శతాబ్దం నాటి ఆలయ శిథిల శిల్పాలు సోమార్‌పేట్ (ఎర్వచింతల్) గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడలో గుర్తించినట్లు ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కరిపె రాజ్ కుమార్ తెలిపారు. కడెం నది ఎడమ ఒడ్డున ఉన్న ఫణీంద్ర స్వామి ఆలయ పరిసరాల్లో స్థానికులు గతంలో గుర్తించినట్లు పేర్కొన్నారు. కడెం బ్యాక్ వాటర్‌లో ఉన్న ఈ విగ్రహాలు ఇటీవలే బయటపడ్డాయన్నారు. ప్రస్తుతం ఫణీంద్ర స్వామి ఆలయం ఉన్న చోట వెయ్యేళ్ల క్రితం పెద్ద దేవాలయం ఉండేదన్నారు. శిల్పులు అద్భుతంగా తీర్చిదిద్దిన అలంకరణలతో ఆలయం శోభాయమానంగా అలరారేదన్నారు. ఆనాటి ఆలయ పైకప్పుకు (సీలింగ్) పదహారు దళాల పద్మమని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ రామోజు హరగోపాల్ పేర్కొన్నా రన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శిథిల శిల్పాలను గ్రామస్తులు భద్రపరచి భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# మొదటికొచ్చిన పునరావాస భూముల లొల్లి

- పాత ఊళ్లకు తరలివస్తున్న కడెం మండలం రాంపూర్, మైసంపూట్ గిరిజనులు
- వంటావార్పుతో నిరసన వ్యక్తం చేసిన గిరిజనుల



**కడెం, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

కడెం మండలంలోని రాంపూర్, మైసంపేట్ పున రావాస గిరిజనులకు పరిహారం కింద మండలంలోని పెత్తర్పు సమీపంలో సాగు భూములు కేటాయించారు. సదరు సాగు భూముల వద్ద ఈ నెల 3న పునరావాస గిరిజనులు, స్థానిక గొండు గూడ వాసుల మధ్య గొడవలు జరిగాయి. బుధవారం పునరావాస కాలనీని ఆర్డీవో రత్నకళ్యాణి, ఎల్డీవో శివకుమార్ సందర్శించి గిరిజనులతో సమావేశం నిర్వహించారు. అధికారుల తీరుకు నిరసనగా గిరిజనులు సమావేశ ఆనంతరం పాతమైసంపేటకు తరలి అక్కడే వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. సాగు భూముల గొడవలులేకుండా చేసి, భూములకు సాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తేనే ఇక్కడి నుంచి కదులుతామని, లేకుంటే పాత గ్రామంలోనే ఉంటామని స్పష్టం చేశారు. కాగా, గురువారం కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ వీరితో సమావేశం నిర్వహించను న్నట్లు సమా చారం. డీటీ లచ్చిరాం, ఎస్ఆర్వో గీతారాణి, సీఐ అజయ్, హైటీకాస్ ఎన్జీవో ఉమ్మడి జిల్లా ప్రతినిధి వెంకట్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



### మూడు నెలల కోటా
## బియ్యం ఒకేసారి

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద లకు అందించే బియ్యం మూడు నెలల కోటా ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎండల తీవ్రత నేపథ్యంలో కార్డు దారులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన కోటాను ఏప్రిల్ నెలలోనే పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 2లక్షల 26వేల 248 మందికి లబ్ధి చేకూరనుంది. మూడు నెలలకు గాను 14,073 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పౌరసరఫరా శాఖ చర్యలు చేపడు తోంది. ఇదివరకు గతేడాది జూన్‌లో వర్షాకాలం నేపథ్యంలో మూడు నెలల కోటాను లబ్ధిదారులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తలెత్తిన ఇబ్బందులను అధిగమిస్తూ అధికారులు తాజాగా అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

### అడవులతోనే
## మానవాళి మనుగడ
### వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

**కడెం, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

అడవులు వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అడవులు వన్యప్రాణుల సంరక్షణతో పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని కడెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గీతా రాణి అన్నారు ప్రపంచ వన్యప్రాణి దినోత్సవ సందర్భంగా బుధవారం కడెం మండల కేంద్రంలో కడెం ఎఫ్ఆర్ఓ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది బైక్ ర్యాలీ అవగాహన కల్పించారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ గీత రాణి మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండవ పూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.సిద్ధార్థ దస్తురాబాద్ ఎఫ్ ఎస్ ఓ జెడ్ కింగ్ ఫిషర్ రేంజ్ పరిధిలోని ఎప్బి ఓలు బేస్ క్యాంప్ వాచర్లు ఎనిమల్ ట్రక్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



# 'పెద్ది' సాంగ్ ఆల్ టైమ్ రికార్డ్!



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది' ఇప్పటికే ఈ సినిమాలో మొదటి పాట విడుదలై పలు రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. తాజాగా రిలీజ్ చేసిన రెండో పాట సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. దీని  తెలుగు వెర్షన్ 24 గంటల్లో అత్యధిక వ్యూస్‌ను సొంతం చేసుకొని ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పింది. విడుదలైన ఒక్కరోజులోనే 31 మిలియన్ల వ్యూస్, 5లక్షల 30వేల లైక్స్‌ను సొంతం చేసుకుంది. 'రై రై రారా... అడ్డే లేని దారై రారా' అంటూ సాగే ఈ పాటకు ఏఆర్ రెహమాన్ స్వరాలు అందించడంతో పాటు స్వయంగా పాడారు.దీనికి రామ్‌చరణ్ హుషారైన స్టెప్స్ ఆకర్షణగా నిలవడంతో వైరల్ అవుతోంది. ఈ పాట వెనక ఉన్న కష్టాన్ని తెలుపుతూ దర్శకుడు తాజాగా పోస్ట్ పెట్టారు.  ఈ పాట షూటింగ్ సమయానికి రామ్‌చరణ్‌కు తీవ్ర జ్వరం ఉందని, దీంతో షూటింగ్ ఆపేద్దామని చెప్పినా ఆయన వినలేదని తెలిపారు. ఈ పాట బాగుందని చిరంజీవి కూడా పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# కెమెరా యాంగిల్స్‌పై నాయికల ఫైర్

సినిమా ప్రచార కార్యక్రమాలు, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరయ్యే నటీమణుల్ని అభ్యంతరకర రీతిలో ఫొటోలు, వీడియోలు తీయడం ఎంతమాత్రం సరైంది కాదంటూ గళం విప్పారు కన్నడ నాయికలు. జూమ్ చేసి మరీ తమని ఫొటోలు తీయాల్సిన అవసరం ఏముందంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్టా వేదికగా పోస్టులు పెట్టారు సప్తమీ గౌడ, రుక్మిణీ వసంత్, ఆషికా రంగనాథ్. "పదే పదే బహిరంగ కార్యక్రమాల్లో మహిళా నటుల ఫొటోలు, వీడియోలను అనుచిత కోణాలలో చిత్రీకరించి ప్రసారం చేస్తున్నారు. అనవసరమైన జూమ్‌లతో మేము చేసే పనికంటే మా శరీరాలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఈ విధంగా కొంతమంది వ్యక్తుల ప్రవర్తన మమ్మల్ని అగౌరవపరిచేలా ఉంది. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యమైన విషయం కాదు. మేము కళ కోసం ఇక్కడ ఉన్నాం. ఉద్దేశపూర్వక జూమ్‌ఇన్ వీడియోలు, అనుచిత కోణాల్లో ఫొటోలు తీయడాన్ని మేము ఖండిస్తున్నాం. అవి స్పష్టంగా మా గౌరవాన్ని ఉల్లఘించేలా ఉన్నాయి. ఇలాంటి చర్యల్ని మేం సహించలేము. వీటి విషయంలో చిత్రసీమలోని మేమంత ఐక్యంగా ఉన్నాం. తరచూ ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొనే ప్రతి మహిళా నటితో మేము నిలబడతాము. ఇలాంటి అనుచిత చర్యలపై మేము ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూనే ఉంటాం"అని తెలిపారు.  ఈ విషయంలో మరింత మంది నాయికలు స్పందించే అవకాశం ఉంది.



# శ్రీలీల స్మార్ట్ ప్లానింగ్

తెలుగు హీరోయిన్ శ్రీలీల తెలివైన నిర్ణయాలతో ముందుకెళ్తోంది. టాలీవుడ్ సినిమాల్లో ఐటం పాటల్లో కొనసాగితే కెరీర్ ఎలా ఉంటుంది? అన్నది అమ్మడు ముందే గుర్తించి అలెర్ట్ అయింది. దీంతో హీరోయిన్ గా వచ్చిన అవకా శాలు సైతం వదులుకోవడానికి ఎంత మాత్రం వెనకడుగు వేయలేదు. హీరోయిన్ ఛాన్స్ ఎరతో? ఐటం పాటలోనూ లాక్ చేసే ప్రయత్నాలు కొందరు చేసే సరికి వారి అతి తెలివిని పసిగట్టే మొత్తం ప్రాజెక్ట్ నే వదులుకుంది. ఈ విష యంలో అమ్మడు ఎంతో తెలివిగా ఎస్కేప్ అయింది. అప్పటి నుంచి తెలుగు అవకా శాల పట్ల తస్మాత్ జాగ్రత్తగా ఉంటుంది.కొత్త అవకా శాలతో ఎవరు వచ్చినా? ఆచి తూచి మాట్లాడుతుంది. నిర్ణయాలు తీసుకునే ముందు మామ్ సలహా కూడా తీసుకుని ముందుకెళ్తుంది. ప్రస్తుతం శ్రీలీల తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ సినిమాలపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్ లో సంచలన మ్యూజికల్ లవ్ స్టోరీ ఆషికీ 3 లో నటిస్తోంది. ఇందులో అమ్మడు కార్తీక్ ఆర్యన్ కు జోడీగా నటిస్తోంది. ఈ సినిమాలో ఇంటిమేట్ సన్నివేశాలున్నా? అమ్మడు ఎంత మాత్రం రాజీ పడలేదు. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తే తాను పూర్తిగా దర్శకుల హీరోయిన్ అని ప్రూవ్ చేయబోతుంది.. ఈ సినిమాకు `ఫీటమ్ పురా` అనే టైటిల్ కూడా పెట్టినట్లు ప్రచారంలో ఉంది. ఇదొక భారీ యాక్షన్ థ్రిల్లర్ అని వినిపిస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే నిజమైతే శ్రీలీల నెట్టింట సంచలనం అవుతుంది. ఒక సినిమా సెట్స్ లో ఉండగానే మరో సినిమా లో ఛాన్స్ అంటే? ఆ వైబ్ వేరే లెవల్లో ఉంటుంది. తాజాతా కోలీవుడ్ స్టార్ ధనుష్ 55వ చిత్రంలోనూ శ్రీలీల హీరోయిన్ గా ఎంపికైంది. కెరీర్ ఆరంభంలోనే ధనుష్ తో నటించే ఛాన్స్ రావడం అంటే? ఎంతో లక్కీ గాళ్ అనే చెప్పాలి. దనుష్ కోసం ఎంతో మంది భామలు క్యూలో ఉంటే వాళ్లందర్నీ పక్కకు నెట్టి మరీ తెలుగు నటి ఛాన్స్ అందుకుంది. త్వరలో `ఉస్తాద్ భగత్ సింగ్` తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో పవన్ కళ్యాణ్ కు జోడీగా నటించింది. ఈ సినిమా హిట్ అయితే గనుక శ్రీలీల పేరు టాలీవుడ్ లో మరోసారి మారుమ్రోగిపోతుంది.



- పల్లె ముంగిటకే 'ప్రజా పాలన'
- ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్త గ్రామ సభలు
- రేపటి నుంచి సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలుకు సిద్ధం
- పారిశుద్ధ్యం, ఫైళ్ల క్లియరెన్స్‌తో శ్రీకారం
- సీఎం సందేశంతో ప్రారంభం..
- 99 రోజుల పాటు 'ప్రగతి ప్రణాళిక'
- నోడల్ అధికారుల నియామకం పూర్తి
- ఆరోగ్యం నుంచి అమలవుతున్న పథకాల వరకు గ్రామ సభల్లో సమగ్ర నివేదన
- అమ్మ ఆదర్శ పాఠశాలలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల చెంతకే నివేదికలు
- కొత్త ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న ప్రత్యేక శిక్షణా తగరతులు..
- జూన్ 12 వరకు కొనసాగనున్న కార్యాచరణ
- 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' మార్గదర్శకాలు జారీ
- నిన్న దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- పనుల పర్యవేక్షణకు ప్రత్యేక యాప్..



# పల్లె ప్రగతికి సరికొత్త బాట

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

**ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహించాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. ఈ సభల నిర్వహణ విధానాన్ని, ప్రజలకు వివరించాల్సిన అంశాలపై వివరాలు వెల్లడించింది. 99 రోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రభావవంతంగా నిర్వహించాలని అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 అంశాల(థీమ్)కు నోడల్ శాఖలను ప్రకటించి, నోడల్ అధికారులను నియమించింది. ఈ కార్యక్రమ మార్గదర్శకాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం జారీ చేశారు. జిల్లా కలెక్టర్లతో సీఎస్ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు.**

ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహించాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. ఈ సభల నిర్వహణ విధానాన్ని, ప్రజలకు వివరించాల్సిన అంశాలపై వివరాలు వెల్లడించింది. 99 రోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రభావవంతంగా నిర్వహించాలని అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 అంశాల(థీమ్)కు నోడల్ శాఖలను ప్రకటించి, నోడల్ అధికారులను నియమించింది. ఈ కార్యక్రమ మార్గదర్శకాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం జారీ చేశారు. జిల్లా కలెక్టర్లతో సీఎస్ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

**ఐదు స్థాయిల్లో కార్యక్రమం...**

ఫిబ్రవరి 27న జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం, ఈ నెల 3న సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు... ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 99 రోజులపాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎస్ జారీచేసిన మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. దీనిని ఐదు స్థాయిల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో, ఏప్రిల్ 16న మండల స్థాయిలో, మే 2న నియోజకవర్గ స్థాయిలో, మే 22న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ ఉంటుందని వివరించారు. ఈ నెల 6న ఉమ్మడి జిల్లాలవారీగా... ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రుల అధ్యక్షతన ఈ కార్యక్రమ సంసిద్ధత (ప్రిపరేటరీ) సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆ వెంటనే 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ప్రారంభించాలని.. ఆ రోజు పారిశుద్ధ్యం, ఫైళ్ల క్లియరెన్స్ అనే అంశాలను తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రణాళిక ఉద్దేశాలు, ప్రాధాన్యాలను కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లకు వివరించడానికి ఈ నెల 12న ఒక రోజు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంశాలవారీగా చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి నోడల్ శాఖలు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తుంటాయని పేర్కొంది. ఏప్రిల్ 2న ఉదయం రాష్ట్ర గీతంతో సభలను ప్రారంభించాలని, ప్రజలకు ముఖ్యమంత్రి వీడియో సందేశాన్ని ప్రదర్శించాలని, శాఖలవారీగా సాధించిన విజయాలను వివరించి, లబ్ధిదారుల పేర్లను వెల్లడించాలని సూచించింది. గ్రామ సభల్లో రైతు భరోసా, రైతు బీమా, సోలార్ పంపులు, మాతా శిశువుల ఆరోగ్య పరిరక్షణ, టీకాలు, హెల్తీ బేబీ పోటీలు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, సన్న బియ్యానికి బోనస్, మహాలక్ష్మి, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, ప్రభుత్వ స్కూళ్లలో డ్రాపౌట్స్, అమ్మ ఆదర్శ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, రహదారి భద్రత, మహిళలు, బాలికలపై అత్యాచారాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, క్రీడలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, బాల్య వివాహాల నియంత్రణ, స్వయం సహాయక బృందాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాంటేషన్ అంశాలపై చర్చించాలని సూచించింది. కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు.

**రేటి నుంచే ప్రగతి ప్రణాళిక**

- 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్షా సమావేశం
- అధికారులకు దిశా నిర్దేశం

# పకడ్బందీగా 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'

- కార్యక్రమం విజయవంతానికి కార్యాచరణ
- మార్చి 6 - జూన్ 12 వరకు 10 అంశాలపై దృష్టి
- పారిశుద్ధం, ఆరోగ్యం, రోడ్డు భద్రత, సంక్షేమం, విద్య, వ్యవసాయంపై రోజువారీ నివేదికలు..
- 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్షా సమావేశం
- ఐదు దశల్లో 99 రోజుల కార్యచరణ అమలు
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్





**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌లతో కలిసి ఆయన ఈ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ 99 రోజుల కార్యక్రమం 10 ప్రధాన అంశాల ఆధారంగా సాగుతుందని, ప్రతి అంశానికి ఒక నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 6 నుండి 15 వరకు అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుధ్య డ్రైవ్ పెండింగ్ ఫైళ్ల పరిష్కార కార్యక్రమం చేపట్టాలని, మార్చి 12న కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ స్థాయి (ఏప్రిల్ 2), మండల స్థాయి (ఏప్రిల్ 16), నియోజకవర్గ స్థాయి (మే 2), జిల్లా స్థాయి (మే 22) రాష్ట్ర స్థాయిలో (జూన్ 2) ఐదు దశల్లో నిర్వహించబడుతుందన్నారు. రైతులకు సోలార్ కనెక్షన్ల ప్రయోజనాలు వివరించడం, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పరిశీలన, మహిళా శిశు సంరక్షణ మరియు పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రోజువారీ పర్యవేక్షణతో పురోగతిని సమీక్షిస్తున్నట్లు, పనుల నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరేలా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన ఆదేశిం చారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ, డిఆర్డీఓ రవీందర్, ఆర్డీఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎందుకు పెట్టారు ఈ యూరియా సెంటర్?

**యూరియా అడిగితే రైతులకు నిర్లక్ష్యంగా సమాధానమిస్తారా?**
**సోమన్‌పల్లి డీసీఎంఎస్ సెంటర్ నిర్వాహకులపై డీఏవో ఆగ్రహం**
**ఏవో తీరుపైనా మండిపడ్డ అధికారి**



**చెన్నూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
సోమన్‌పల్లిలోగల డీసీఎంఎస్ సెంటర్‌లోని యూరియా బస్తాలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ బుధవారం విచారణ చేపట్టారు. 'డీసీఎంఎస్ సెంటర్‌కు జనవరిలో 222 బస్తాల యూరియా అంది చాం. రైతులకు కనీసం ఒక్క బస్తా కూడా ఇవ్వలేదు. ఎవరికి అందించారని అడిగితే ఎలాంటి స్పందన లేదు. సెంటర్ ఒకరి పేరు మీద ఉంటే.. నిర్వహించేది మరొకరా.? ఒక్క యూరియా బస్తా కూడా రైతులకు అందించనప్పుడు మీకు సెంటర్ ఎందుకు' అంటూ ఆమె నిర్వాహకులపై మండిపడ్డారు. పైగా యూరియా అడిగిన రైతులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారా.. అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు డీఏవోతో మాట్లాడారు. డీసీఎంఎస్ సెంటర్‌కు అందించిన యూరియా బస్తాలను సెంటర్ నిర్వాహకుడితో పాటు మరో వ్యక్తి కలిసి పంచుకున్నారని తెలిపారు. సెంటర్ నిర్వాహకుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడంతో ఆయనకు అవసరమున్నప్పుడు యూరియా తెప్పించి, వారికి అనుకూలంగా ఉన్న వారికి ఎలాంటి రసీదులు లేకుండా ఎక్కువ డబ్బులకు అమ్ముకుంటున్నారని రైతులు ఆమెకు వివరించారు. ఏవో యామిని పర్యవేక్షణ లేకపోవడంతో డీసీఎంఎస్‌లో ఉన్న యూరియా బస్తాలు పక్కదారి పట్టినట్టు రైతులు తెలిపారు. ఏఈవో కూడా గ్రామంలోని రైతులకు అందుబాటులో ఉండడం లేదని చెప్పగా, ఆమె మండిపడ్డారు. యూరియాను పక్కదారి పట్టించిన డీసీఎంఎస్ సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డీఏవోకు వినతి పత్రాన్ని అందజేశారు. సోమన్‌పల్లిలో చేపట్టిన విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తానని డీఏవో తెలిపారు.



## హెల్త్ మిషన్ సేవలపై అవగాహన

**మంచిర్యాల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ప్రజాపాలన-పట్టణ ప్రణాళిక 100 రోజుల హెల్త్ మిషన్ సేవలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అనిత అవగాహన కల్పించారు. బుధవారం ఆమె జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, బస్తీ దవాఖాన, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రజా పాలన - పట్టణ ప్రణాళిక ఆరోగ్య మిషన్ కార్యక్రమాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. మాతాశిశు సంరక్షణ, టీకాల కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, నివారణపై సూచనలు చేశారు. కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల సహకారంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. వయోవృద్ధులకు వైద్య పరీక్షలు, 30 ఏళ్లు నిండిన వారికి అసంక్రమణ వ్యాధులపై పరీక్షలు చేయాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆరోగ్య కార్డుల నమోదు, వంద రోజుల్లో వచ్చే జాతీయ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రోగ్రాం అధికారులు సుధాకర్నాయక్, ప్రసాద్, అరుణశ్రీ, అనిల్, డీపీవో వో ప్రశాంతి, సీహెచ్ నాందేవ్, డీడీఎం భాగ్య, ప్రవళిక, సుమన్, ఎస్వో కాంతారావు, డీపీ హెచ్‌ఎన్ ఆర్ఎస్ పద్మ, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను గుర్తించాలి

**మంచిర్యాల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. గజెల్లి వెంకటయ్య, జ్ఞాని, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



**ముథోల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో పరశురాంనాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షాకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోకేశ్వరం పరీక్షాకేంద్రంలో ద్వితీయ సంవత్సరం పరీక్షకు 120 మంది హాజరు కావాల్సి ఉండగా 117 మంది హాజరైనట్లు తెలిపారు. సీఎస్ విఠల్ ఉన్నారు.

**కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు....**
ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో సజావుగా కొనసాగుతున్నాయి. బుధవారం సెకండియర్ విద్యార్థులకు బాటనీ/ గణితం/ పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 6,227 మంది విద్యార్థులకు గాను 6053 మంది హాజరు కాగా, 174 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జాదవ్ పరశురాం లోకేశ్వరం, ముథోల్, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు.



## బాల్క సుమన్‌కు స్వాగతం

**దండేపల్లి, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా జైలు నుండి బుధవారం విడుదలైన చెన్నూరు మాజీ శాసనసభ్యుడు బాల్క సుమన్‌కు దండేపల్లి మండలం మ్యాదరిపేట వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టపకాయలు పేల్చుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అధికార బలంతో బాల్క సుమన్ పై అక్రమంగా కేసులు పెట్టి జైలులో వేశారని మండిపడ్డారు. అధికార బలంతో అక్రమ కేసులు నిలబడవని, రానున్న రోజులలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

## నామినేషన్ డబ్బులు ఇవ్వని అధికారులు

**చెన్నూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
చెన్నూర్ మున్సిపల్ ఎన్నికలు జరిగి 20 రోజులు కావస్తున్నా అభ్యర్థులు చెల్లించిన నామినేషన్ డబ్బులు మున్సిపల్ అధికారులు తిరిగి ఇవ్వకుండా స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారని 9వ వార్డు కౌన్సిలర్ సుద్దపల్లి సునీత ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎస్సీ, బీసీ అభ్యర్థులు రూ.1,250, జనరల్ అభ్యర్థులు రూ.2,500 చొప్పున చెల్లించారని, 18 వార్డుల్లో 107 మంది పోటీ చేశారన్నారు. ఈ విషయమై కమిషనర్ వివరణ కోరగా నామినేషన్ డబ్బులు చెల్లించాలని అభ్యర్థి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి డబ్బులు చెల్లిస్తామన్నారు.



## రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

**రెబ్బెన, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
మండల పరిధిలోని సింగల్గూడ, ఇందిరానగర్ మధ్యలో గల రైల్వే డౌన్‌లైన్‌పై బుధవారం సాయంత్రం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. మృతునికి 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. ఒంటిపై తెలుపు రంగుషర్టు, స్కైబ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ఆస్పత్రి భద్రపర్చినట్లు తెలిపారు.

## బావిలోపడి ఒకరు మృతి

**ముథోల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
మద్యం మత్తులో బావిలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని మహాలక్ష్మి గల్లీకి చెందిన లింగన్న (బాబేష్) (48) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మద్యం సేవించి ఇంటి నుంచి బయటకు వెళ్లిన లింగన్న తిరిగిరాలేదు. కోలిగల్లీలోని హనుమాన్ ఆలయం సమీపంలో చెరువు కట్ట కింద ఉన్న బావిలో మృతదేహం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆవుపై చిరుతపులి దాడి?

**బోథ్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
కరత్వాడ గ్రామ పరిధిలోని లక్నాయ్ లొద్ది ఏరియాలో ద్యాగాల గంగయ్య అనే రైతుకు చెందిన ఆవుపై చిరుతపులి దాడి చేసి హతమార్చినట్లు సమాచారం. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం మేతకు వెళ్లిన ఆవు ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం లక్నాయ్ లొద్ది గుట్ట ప్రాంతంలో మృతి చెంది కనిపించింది. చిరుతపులి దాడి చేసినట్లు ఆనవాళ్లు ఉండటంతో రైతులు, పశువుల కాపరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాగా చిరుతపులి దాడి చేసినట్లు అటవీ శాఖ అధికారులు ఇంకా నిర్ధారించలేదు. దాడి చేసిన ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను అమరుస్తున్నట్లు తెలిపారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అడవిమార్గంలో వెళ్లవద్దని సూచించారు.

## ఫిర్యాదులు పరిష్కరించాలి

**ముథోల్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
బాధితులకు సత్వర న్యాయం అందేలా ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరుగురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు. బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయం అందించాలన్నారు. కుటుంబ వివాదాల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షీటీం పాత్రను ప్రశంసించారు.

# చొప్పరపల్లి అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు

**కాసిపేట, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామ పంచాయతీలోని చొప్పరపల్లిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేయడపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా లబ్ధిదారులకు కోడిగుడ్లు పంపిణీ చేశారు. వంట చేసే క్రమంలో వాటిని చూడగా మొత్తం కుళ్లిపోయి ఉన్నాయి. నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేయడంపై మండిపడ్డారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కోడి గుడ్ల ధరలు పెరగడంతో జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సదరు కాంట్రాక్టర్లు నాసిరకమైన తక్కువ ధరకు లభిస్తున్న కోడి గుడ్లను కొనుగోలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు.



## మహోన్నత చరిత్ర కలిగిన
# ప్రాంతం గాంధారి ఖిల్లా
### ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



**మంచిర్యాల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్‌లో ఆదివాసీ నాయకపోడు ప్రతినిధులు కొమ్మ భీమన్న, నాల్నేని రమణ, పుస్తక రచయిత మేసినేని రాజన్నలతో కలిసి గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు పర్యటించినట్లు చరిత్ర ఉందని, గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ది పొం దిందని, ఈక్రమంలో గాంధారిఖిల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారన్నారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి ఖిల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సాకేర సర్పంచ్, పుస్తక సహాయ రచయిత దయనేని రమేష్, ఆదివాసి నాయకపోడు సాంస్కృతిక కళ అభివృద్ధి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులుపాల్గొన్నారు.

# కాంగ్రెస్ అవినీతి పాలనను ఎండగడతా

### ఇప్పటికైనా ప్రజాస్వామ్య బద్ధంగాత చైర్మన్ ఎన్నిక నిర్వహించాలి
### చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్




**రామకృష్ణాపూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ అవినీతి పాలనను ఎండగడతానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో అక్ర మ అరెస్టులకు బయపడలేదని క్యాతన్‌పల్లి ఆదిలాబాద్ జైలు నుంచి విడుదలైన క్యాతన్‌పల్లికి వచ్చిన సందర్భంగా క్యాతన్‌పల్లిలో ఆయన నివాసం ఏర్పాటులో చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ ఎక్కడ కైవసం చేసుకుంటుందోనని పోలీసు, అధికారుల అండతో ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకొని అక్రమంగా బీఆర్ ఎస్ నాయకులపై కేసులు పెట్టారని అయినా భయపడేదిలేదన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ దుర్మార్గంగా మహిళ కౌన్సిలర్లపై అసభ్యకరంగా వ్యవహరించి రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ ప్రజలు మంత్రి వివేక్‌ను, కాంగ్రెస్ పాల నను వ్యతిరేకించి బీఆర్ఎస్‌కు జైకొట్టడాన్ని జీర్ణించుకోలేకనే పదుల సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి జైల్లో ఇబ్బందులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు తగిన గుణపాఠంచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన కాంగ్రెస్ అవినీతి పాలనను ఎండగడుతానని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాక ర్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మూల రాజిరెడ్డి పాల్గొన్నారు.

**బాలసుమన్‌కు ఘన స్వాగతం...**
అక్రమ కేసులు తన మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని, ప్రభుత్వ అణచివేత ధోరణిని ఎండగడుతామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఇటీవల మంత్రి కాన్వాయ్‌పై దాడి ఘటనలో అరెస్టు అయిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ రిమాండ్ అనంతరం బెయిల్‌పై జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. ఈ సందర్భంగా జన్నారం, లక్షెట్టిపేట, దండేపల్లి, మంచిర్యాలలో ఘన స్వాగతం పలికాయి.



## కుమారుడి పెళ్లికి ఆదివాసీ
# మహిళలను ఆహ్వానించిన భట్టి
### వాట్సాప్ ద్వారా ఆహ్వాన పత్రికను పంపి ఫోన్‌లో మాట్లాడిన డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ఉట్నూర్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహానికి హాజరు కావాలని ఆదివాసీ మహిళలకు ఆహ్వానం అందింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలోని దువుగూడా గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళలు మరప గంగుబాయి, సిడాం లక్ష్మీబాయి, గిరిజన రైతు మరప కోసు, సర్పంచ్ మరసుకోలా మహాదును భట్టి విక్రమార్క సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు భట్టి పీఆర్వో ఉట్నూరు ఎంపీడీవో రాంప్రసాద్‌కు వాట్సాప్ ద్వారా ఆహ్వాన పత్రికను పంపి ఫోన్‌లో మాట్లాడారు. అలాగే, ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలం బూసిమెట్ట గ్రామానికి చెందిన జానకి సుమన్‌బాయి, వేల లక్ష్మీబాయి, రుక్మబాయిలకు కూడా ఆహ్వానాలు అందాయి. గత జనవరిలో భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో వీరంతా ఆయనతో కలిసి నడిచారు. ఆ అనుబంధాన్ని గుర్తుంచుకున్న భట్టి, గురువారం శంషాబాద్ సమీపంలో జరగనున్న వివాహ వేడుకకు ప్రత్యేకంగా పిలిచారు. పంచాయ తీ కార్యదర్శి నాగజ్యోతి ఆధ్వర్యంలో వీరంతా వేడుకకు హాజరుకానున్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు కంటి వైద్య శిబిరం

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు తప్పనిసరిగా ఆరోగ్య కారులు తమ వెంట తెచ్చుకోవాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రమేష్ సూచించారు. ఉచితంగా శస్త్ర చికిత్స, రవాణా, వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తారన్నారు.

# ఎల్లంపల్లి పరిహారంపై హైకోర్టు సీరియస్

**మంచిర్యాల, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల కష్టాలపై హైకోర్టు స్పందించింది. రెండు దశాబ్దాలు గడుస్తున్నా పరిహారం అందకపోవడంపై విచారణ చేపట్టిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం చేగ్యం గ్రామానికి చెందిన 126 కుటుంబాలు 20ఏళ్లుగా పునరావాసం కోసం ఎదురుచూస్తున్నాయి. తొలుత రూ.58 కోట్ల పరిహారం ఇస్తామని జీవో జారీచేసిన అప్పటి ప్రభుత్వం, ఆ తర్వాత దాన్ని రూ.28 కోట్లకు, ఇప్పుడు ఏకంగా రూ.18 కోట్లకు తగ్గించిందని పిటిషనర్లు ఆరోపించారు. వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. పరిహారం చెల్లించకపోవడంపై వివరణ ఇవ్వాలని నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్, భూసేకరణ అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**ఆసిఫాబాద్, మార్చి 4 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్బాల్ ఎంపికా పోటీలు గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 20 మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ తెలిపారు. ఎంపికైన వారికి ఏడు రోజులు రెసిడెన్షియల్ లో కోచింగ్ క్యాంప్ నిర్వహించి, ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్బాల్ టోర్నమెంట్కు పంపనున్నట్లు తెలిపారు.పోటీలకు సహకారం అందించిన గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, క్రీడా పాఠశాల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా హ్యాండ్బాల్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున యాదవ్ క్రీడాకారులను అభినందిస్తూ భవిష్యత్తులో ఎంపీపీ కప్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, మడవి శేకు, జంగు, సాయిబాబా, కోచ్లు అరవింద్, రాజలింగు, విద్యాసాగర్, రవి, రాకేష్, యాదగిరి, శృతి పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY